ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152
షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 238

బుధవారం 09 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# విజయవాడ మేయర్ పీఠంపై కర్చీఫ్ వేసేశారు!

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 08)

విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి కీలక పదవి మేయర్. దీనిని దక్కించుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యే ఒకరు కర్చీఫ్ వేసేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు.. తన కుమారుడు సిద్ధార్థ ను ఈ కీలక పదవికి ఎంపిక చేయాలన్నది ఉమా కోరిక. ఈ నేపథ్యం లో ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిసి బయోడేటా కూడా సమర్పించారు. అయితే.. దీనిపై చంద్రబాబు ఎలాంటి ప్రకటనా చేయలేదు.తాజాగా జరుగుతున్న పార్టీ నాయకుల కాన్క్లేవ్‌లో చంద్రబాబు ఈ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఎవరికి వారు మేయర్ పీఠాలపై కర్చీఫ్‌లు వేసేసుకుంటున్నారని అన్నారు. ఇది సరైన విధానం కాదని తెలిపారు. స్థానిక ఎన్నికల తర్వాత.. నాయకుల అభిప్రాయం తెలుసుకుని.. మేయర్, మునిసిపల్ చైర్మన్ ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ఈ విషయంలో పార్టీ కూడా.. ఎలాంటి నిర్ణయం తీసుకోదని.. స్థానికంగా ▶2లో



# పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాల్సిందే

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 08)

పార్టీ పదవుల్లో ఉన్నవారిని మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని, పార్టీనే సుప్రీం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యక్రమాల నిర్వహణపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. పార్టీ ఏదైనా పని చెబితే దానికే మొదటి ప్రాధాన్యమివ్వాలని లోకేశ్ తెలిపారు. "క్వాంటమ్ టవర్స్‌కు సంబంధించిన కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తే... అదే సమయంలో పార్టీ అప్పగించిన పని ఉండటంతో అదే నాకు ముఖ్యమని చెప్పి, ఆ కార్యక్రమానికి వెళ్లలేదు" ▶2లో



# వైసీపీ హిట్ -రన్ -హైడ్ ప్లాన్.... బాబు డీ కోడ్ చేశారా ?

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 08)

హిట్ -రన్ -హైడ్ విధానం. ఇది కొత్తగా ఉంది కదా. రాజకీయాల్లో ఈ తరహా ప్లాన్స్ ఉంటాయా. ఉంటే వర్కౌట్ అవుతాయా. ఏమో వైసీపీ విషయంలో ఇదే జరుగుతోందని రాజకీయ చాణక్యుడు చంద్రబాబు అంటున్నారు. వైసీపీ మీద ఆయన రెగ్యులర్ కామెంట్స్ చేస్తూనే ఈ కొత్త విధానం వారు అమలు చేస్తున్నారు అని టీడీపీ ఎమ్మెల్యేల ప్రజా ప్రతినిధుల వర్క్ షాప్ లో చెప్పుకొచ్చారు. దాంతో ఇది చాలా మందికి అర్థం కాలేదు. హిట్ రన్ అన్నది సాధారణంగా రోడ్డు ప్రమాదాల విషయంలో వాడుతారు, ఒకరికి యాక్సిడెంట్ చేసి వెళ్ళిపోవడం. ఇక్కడ మరో మాట కూడా వాడారు, హైడ్ అని. అంటే దాక్కోవడం. వైసీపీ చేస్తున్న పని ఇదే అని బాబు ఆ పార్టీ వ్యూహాన్ని మొత్తం ఇలా డీ కోడ్ చేసి మరీ తన పార్టీ వారికి వివరించారు అన్న మాట.

ఇంతకీ ఏమిటిది : వైసీపీ అయితే అసెంబ్లీకి రావడం లేదు, ముఖాముఖి చర్చలకు ఆస్కారం ఇవ్వడం లేదు, అదే సమయంలో కొన్ని ఇష్యూస్ ని తాను ఎంచుకుని వాటిని జనంలోకి ముమ్మరంగా ప్రచారం చేసి పెడుతోంది. ఆ మీదట తన వాదన నిజమని అనేలా ప్రభావితం చేస్తోంది. ఇక అవతల వారి సవాళ్ళకు కానీ చర్చలకు కానీ ఎక్కడా రియాక్ట్ అవకుండా హైడ్ అవుతోంది అన్నది బాబు విమర్శలకు అర్థం గా చెబుతున్నారు. వైసీపీ గడచిన 26 నెలల కాలంలో కూటమి మీద అనేక విమర్శలు చేసింది.

కొన్నింటి విషయంలో ఆందోళనలు నిరసనలు నిర్వహించింది. అయితే వాటికి కూటమి నుంచి జవాబు వెళ్తోంది, కానీ సహజంగా విపక్షానికి ఉండే అడ్వాంటేజ్ వల్ల జనం లోకి వెళ్తోంది అన్నది టీడీపీ అధినాయకత్వం భావనగా ఉంది. ఇక ఏ రకమైన ఆరోపణలు విమర్శలు అయినా అసెంబ్లీ వేదికగా చర్చిస్తే వాస్తవాలు బయటపడతాయి. కానీ ఆ చాన్స్ వైసీపీ ఇవ్వడం లేదు, అసెంబ్లీకే వైసీపీ వెళ్ళడం మానుకుంది. దాంతో హైడ్ అవుతూ వైసీపీ దాక్కుంటోంది అని చంద్రబాబు విమర్శిస్తున్నారు. ▶2లో



# అయ్యన్న కొడుకు బాటలోనే గంటా కొడుకు కూడా ?

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 08)

ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీలో ఇద్దరు మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అయ్యన్నపాత్రుడుల పలుకుబడి గట్టిగా ఉందన్న సంగతి తెలిసిందే. ఈ ఇద్దరూ దశాబ్దాల తరబడి రాజకీయాలు చేస్తూ వచ్చారు విజయాలు సాధిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లా మీద తమదైన ముద్రను వేశారు. అయ్యన్న ఏడు సార్లు ఎమ్మెల్యే ఒకసారి ఎంపీగా గెలిస్తే గంటా ఒకసారి ఎంపీగా అయిదు సార్లు ఎంపీగా గెలిచారు. అయ్యన్న పదేళ్ళకు పైగా వివిధ ప్రభుత్వాలలో మంత్రిగా చేస్తే గంటా కాంగ్రెస్ టీడీపీ ప్రభుత్వాలలో ఏడేళ్ళ పాటు మంత్రిగా ఉన్నారు. ఇలా ఇద్దరూ రాజకీయంగా ప్రముఖ నేతలుగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు తన రాజకీయ విరమణను ప్రకటించేశారు. తన కుమారుడు విజయ్ ని రాజ్యసభను ఆయన పంపించుకోగలిగారు. అలాగే రెండవ కుమారుడు రాజేష్ ని ఆయన నర్సీపట్నం నుంచి 2029 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయించేందుకు మార్గం సుగమం ▶2లో



# కాకినాడ వైసీపీలో ప్రకంపనలు.. పార్టీని వీడిన కీలక నేత

పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నేత నెక్కంటి సాయి ప్రసాద్

ఆయన బాటలో సిద్ధమవుతున్న పలువురు కౌన్సిలర్లు

రాజీనామా చేసిన నేతలు జనసేనలో చేరవచ్చని ఊహాగానాలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 08)

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి (వైసీపీ) వరుస ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. తాజాగా కాకినాడ జిల్లాలో పార్టీకి మరో గట్టి షాక్ తగిలింది. సీనియర్ నాయకుడు, జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెక్కంటి సాయి ప్రసాద్ వైసీపీకి రాజీనామా చేశారు. పెద్దాపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన సాయి ప్రసాద్, తన రాజీనామా లేఖను పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి పంపించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీని వీడుతున్నట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే, అసెంబ్లీ ▶2లో



# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు

స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు

వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ

పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 08)

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో ▶2లో

# డీఎస్సీపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమే: ఎమ్మెల్యే బోడే ప్రసాద్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 08)

టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ▶2లో

# నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: మార్గాని భరత్

డీఎస్సీలో అక్రమాలు జరిగాయన్న మార్గాని భరత్

సూత్రధారులను వెలికి తీసేందుకు సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్

లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే తాను ఎంపీగా గెలిచానని వ్యాఖ్య

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 08)

ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతోందని అధికారులు చెప్పారని... దీని అర్థం డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెప్పడమే అని అన్నారు. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేయకుండా ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన 382 ఉద్యోగాలను ఎవరికి ఇచ్చారో పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి ▶2లో



# ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే: డొనాల్డ్ ట్రంప్

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్

గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం



# వైసీపీ హిట్ -రన్ -హైడ్ ప్లాన్....
## బాబు డీ కోడ్ చేశారా ?

లైట్ తీసుకోవద్దు :వైసీపీ హిట్ రన్ హైడ్ ప్లాన్ ని అమలు చేస్తోంది అని చంద్రబాబు చెబుతూనే పార్టీ నాయకులు ఎవరూ దీనిని లైట్ తీసుకోవద్దని హెచ్చరించారు. ఆ పార్టీ ఫేక్ ప్రచారం చేస్తోందని దానిని ధీటుగా తిప్పికొట్టాల్సి ఉందని కూడా ఆయన గట్టిగా ఒకటికి పదిసార్లు చెబుతున్నారు. ఏపీలో ఏ మంచి జరిగినా దాని మీద వైసీపీ విమర్శలు చేస్తోంది. కొన్ని సార్లు క్రెడిట్ తమదే అని క్లెయిం చేస్తోందని కూడా బాబు మండిపడ్డారు. వైసీపీవి అన్నీ వక్రీకరణలు అబద్ధపు ప్రచారాలు అని బాబు అంటూ దీనిని జనంలో ఉంచి వాస్తవాలను చెప్పడ్డం ద్వారానే టీడీపీ కూటమి తాము చేసింది ఏంటో చూపించగలుగుతుందని అన్నారు.

సోషల్ మీడియాతో కూడా :ఇక ఆ మధ్య మోడీ తన పార్టీ వారిని సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండమని కోరారు. చంద్రబాబు ఇపుడు అదే మాట చెబుతున్నారు. సోషల్ మీడియాలో పార్టీ నేతలు అంతా యాక్టివ్ గా ఉండాలని ఆయన కోరారు. అక్కడ పెద్ద ఎత్తున వైసీపీ విమర్శలను తిప్పుకొట్టాలని ఎప్పటికప్పుడు ఇదంతా జరగాలని ఆ విధంగా అప్డూ డేట్ కావాలని ఆయన కోరడం విశేషం. మొత్తం మీద చూస్తే వైసీపీ మాయా యుద్ధం చేస్తోంది అన్న అర్థం వచ్చేలా కూటమి నేతల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఎదురు నిలిచి పోరాడకుండా అసెంబ్లీలో చర్చలకు రాకుండా వైసీపీ కొత్త ప్లాన్ తో కార్నర్ చేస్తోంది అని దానిని టార్గెట్ చేసి చేదించాలని తన పార్టీ నాయకులకు బాబు దిశా నిర్దేశం చేశారు అన్న మాట. మరి వైసీపీ హిట్ రన్ హైడ్ అజెండాను సక్సెస్ ఫుల్ గా అమలు చేస్తోందా, ఆ ప్లాన్ వర్కౌట్ అవుతుందని నమ్మకం పెట్టుకుందా బాబు చెప్పినట్లుగా వైసీపీ స్ట్రాటజీ ఇదేనా అంటే చూడాల్సిందే మరి.

# విజయవాడ మేయర్ పీఠంపై కర్చీఫ్ వేసేశారు!

విజయం దక్కించుకున్న వారి అభిప్రాయాలు, ప్రజా మోదం తప్పని సరి అని పేర్కొన్నారు.మరో వైపు.. బీసీ నాయకులు కూడా విజయవాడ మేయర్ పీఠంపై దృష్టి పెట్టారు. గతంలో 1995లో విజయ వాడ మేయర్ పీఠాన్ని బీసీకి టీడీపీ ఇచ్చింది. అప్పట్లో పంచుమర్తి అనురాధ మేయర్‌గా ఎంపికయ్యారు. ఆ తర్వాత.. మళ్లీ కమ్మ సామాజిక వర్గానికి ఇచ్చినా.. పార్టీ పెద్దగా లబ్ధి పొందలేదు. దీంతో ఇప్పుడు మరోసారి బీసీలకు అవకాశం ఇవ్వాలని.. కోరుతున్నారు. గత స్థానిక ఎన్నికల్లో వైసీపీ ఇదే మంత్రాన్ని పఠించింది. బీసీ మహిళకు విజయవాడ మేయర్ పీఠాన్ని అప్పగించింది.రాష్ట్రంలోనూ నగరంలోనూ బీసీలు ఎక్కువగా ఉన్నందున.. ఆ వర్గానికి అవకాశం ఇప్పించాలన్నది టీడీపీ బీసీ నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేలు అగ్రవర్ణాలకు చెందిన వారని.. కీలకమైన విజయవాడలో బీసీలకు పార్టీ ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. బీసీల ఓటు బ్యాంకు కీల కంగా మారుతున్న నేపథ్యంలో విజయవాడ మేయర్ పీఠాన్ని వారికి ఇవ్వాలన్నది స్థానిక నాయకుల డిమాండ్. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.

# అయ్యన్న కొడుకు బాటలోనే గంటా కొడుకు కూడా ?

చేసుకుంటున్నారని ప్రచారం సాగుతోంది.

గంటా వారసుడు రెడీ :అయితే గంటా వారసుడు కూడా మరో వైపు రెడీగానే ఉన్నారని అంటున్నారు. ఇప్పటికే భీమిలీ నియోజకవర్గంలో తండ్రి సీటులో గంటా రవితేజ తాను కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. పార్టీ కార్యక్రమాలలో ఆయన చురుకుగా ఉంటున్నారు. దాంతో వచ్చే ఎన్నికల్లో ఆయనే భీమిలీ నుంచి టీడీపీ తరఫున అభ్యర్థి అని ప్రచారం సాగుతూ వస్తోంది. అయితే భీమిలీ సీటు ఇపుడు హాట్ అండ్ స్వీట్ సీటుగా మారింది అని అంటున్నారు. నేరుగా టీడీపీ అధినాయకత్వం చూపు ఈ సీటు మీద ఉందని అంటున్నారు. దానికి కారణం అనేక పరిశ్రమలు ఐటీ కంపెనీలు గూగుల్ డేటా సెంటర్ వంటివి ఇక్కడే ఏర్పాటు కావడంతో ఒక్కసారిగా భీమిలీ ప్రాధాన్యత పెరిగింది అని అంటున్నారు.

భారీగానే పోటీ :ఈసారి భీమిలీ సీటుకు భారీగానే పోటీ ఉంటుందని అంటున్నారు. గంటా రాజకీయ విరమణ ప్రకటిస్తే ఆయన కుమారుడికి దక్కుతుందని కూడా చెప్పలేని పరిస్థితి అని అంటున్నారు. ఎంపీగా ప్రస్తుతం ఉన్న శ్రీ భరత్ భీమిలీ నుంచి పోటీ చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు అని ప్రచారం కూడా ఉంది. అలాగే టీడీపీ అధినాయకత్వానికి దగ్గర వారు కూడా ఈ సీటు నుంచి పోటీ చేయవచ్చు అని మరో ప్రచారం ఉంది. ఈ

### మొదటి పేజీ తరువాయి

క్రమంలో గంటా వారసుడి భవిష్యత్తు ఏమిటి అన్న చర్చ కూడా వస్తోంది. అయితే రాజకీయ వ్యూహాలలో ఆరితేరిన గంటా ప్లాన్ బీని కూడా సిద్ధంగా ఉంచుకున్నారు అని అంటున్నారు. దాంతో తన కుమారుడికి భీమిలీ సీటు కాకపోతే విశాఖ ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నారు అని అంటున్నారు.

రెండు ఆప్షన్లతో :విశాఖ ఎంపీ సీటు 2029 నాటికి డీ లిమిటేషన్ లో భాగంగా రెండు అవుతుందని అంటున్నారు. అలా కనుక జరిగితే ఒకటి విశాఖ సెంట్రల్ గా మార్పు చెందుతుందని అందులో భీమిలీ అసెంబ్లీ సీటు కూడా ఉంటుందని దాంతో సొంత బలంతో పాటు పార్టీ బలం కూడా తోడు అయితే 2029 ఎన్నికల్లో గంటా వారసుడు ఈజీగా గెలిచేందుకు వీలు అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. ఒక వేళ అలా కనుక కుదరకపోతే విజయనగరం ఎంపీ సీటు మీద కూడా గంటా ఫోకస్ పెట్టి ఉంచారని అంటున్నారు. గతంలో టీడీపీ మంత్రిగా ఉన్నపుడు ఆయన విజయనగరం జిల్లా ఇంచార్జిగా పనిచేశారు. దాంతో ఆ పరిచయాలు ఉన్నాయని స్థానిక రాజకీయం మీద కూడా అవగాహన ఉంది కాబట్టి కుమారుడిని అక్కడ నుంచి అయినా బరిలోకి దించుతారు అని అంటున్నారు.

ఇద్దరూ పార్లమెంట్ కే :అదే కనుక జరిగితే అయ్యన్న కుమారుడు విజయ్ తో పాటుగా గంటా కుమారుడు కూడా పార్లమెంట్ కి వెళ్తారు అని అంటున్నారు. ఇప్పటికే పెద్దల సభలో విజయ్ ఉన్నారు, దాంతో గంటా వారసుడు లోక్ సభ నుంచి ఎంపీగా వస్తారని అంటున్నారు. గంటా కూడా తొలిసారి ఎంపీగానే గెలిచి తన రాజకీయాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు అని గుర్తు చేస్తున్నారు.

# కాకినాడ వైసీపీలో ప్రకంపనలు.. పార్టీని వీడిన కీలక నేత

ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి కారణంగానే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.సాయి ప్రసాద్ బాటలోనే జిల్లాలోని పలు పట్టణాలకు చెందిన మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు కూడా పయనించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వారంతా త్వరలోనే పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరవచ్చని ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ వరుస రాజీనామాలు జిల్లా వైసీపీ శ్రేణుల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు.ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు.ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి.వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: మార్గాని భరత్

చర్యలు ఎందుకు తీసుకోలేదని మార్గాని భరత్ నిలదీశారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ పైనా ఆరోపణలు చేస్తూ... పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు. అసెంబ్లీని, ప్రజలను పచ్చి అబద్ధాలతో తప్పుదోవ పట్టించిన లోకేశ్ కి జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. "లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే నేను ఎంపీగా గెలిచాను. డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ తో ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం. కరకట్ట నివాసమైనా, హైదరాబాద్ ఇల్లయినా తేదీ, సమయం ఆయనే ప్రకటించాలి" అని బహిరంగ సవాల్ విసిరారు.

# ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే: డొనాల్డ్ ట్రంప్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 08)

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు."ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందో, ప్రపంచ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావం కచ్చితంగా ఎలా ఉంటుందో అనే దానిపై ట్రంప్ వ్యాఖ్యలు మినహా స్వతంత్రంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.

# పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాల్సిందే

అని ఆయన సొంత అనుభవాన్ని వెల్లడించారు. "పార్టీ ఇచ్చిన పనుల్ని తప్పనిసరిగా చేయాల్సిందే. పార్టీ పదవుల్లో ఉన్నవారు.. పార్టీ కార్యక్రమాలకు రావడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు" అని స్పష్టం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు బీఫారం ఇవ్వకపోతే... ఇక్కడున్నవారెవరూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కాలేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. "పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి. నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయో నిరంతరం సమీక్షించుకోవాలి" అని కోరారు.

# డీఎస్సీపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమే: ఎమ్మెల్యే బోడే ప్రసాద్

ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వారి కల నెరవేరితే, వారి మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ వైసీపీ నేతలు అవమానించడం బాధాకరమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు గతంలో యువత జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు.

# విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద కృష్ణాపురం రైతుల ధర్నా



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 8)

గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా సరిగ్గా అందడం లేదని ఆరోపిస్తూ మైదుకూరు మున్సిపాలిటీ కృష్ణాపురం గ్రామానికి చెందిన సుమారు 25 మంది రైతులు మంగళవారం ఉదయం స్థానిక విద్యుత్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆదివారం నుంచి విద్యుత్ రాక ఇబ్బంది పడుతున్నామని, సబ్–స్టేషన్‌లోనే సమస్య ఉందని గుర్తించినా అధికారులు పట్టించుకోకుండా ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లోపాల వల్ల గ్రామంలో దాదాపు 20 వ్యవసాయ మోటార్లు కాలిపోయి తీవ్రంగా నష్టపోయామని రైతులు ధ్వజమెత్తారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏడీ జె. శ్రీకాంత్ వెంటనే రైతులతో మాట్లాడి, సాయంత్రం 7 గంటల కల్లా విద్యుత్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు రాబోయే మూడు రోజుల పాటు సాధారణ 9 గంటల ఉచిత విద్యుత్‌కు అదనంగా మరో 2 గంటలు (మొత్తం 11 గంటలు) కరెంట్ సరఫరా చేయాలని లైన్‌మెన్‌ను ఆదేశించారు. ఏడీ స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం రైతులు ఏపీ లక్ష్మయ్య, ఏపీ చిన్న రాయుడు, కూశెట్టి వెంకటసుబ్బయ్య, కూశెట్టి పుల్లయ్య, భూమిరెడ్డి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయకచవితి పండుగను జరుపుకోవాలి

## పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం రాజేష్ కుమార్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టంబర్ 8)




పొదిలి సర్కిల్ పరిధిలోని పొదిలి, కొనకొనమిట్ల, తర్లుపాడు మండలాల ప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ ఎం రాజేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ వినాయక మండపాలను ఏర్పాటు చేసే ప్రతి కమిటీ వారు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా నిర్వాహకులు ఎప్పుడూ ఇద్దరు లేదా ముగ్గురు వాలంటీర్లను కాపలాగా ఉంచాలన్నారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్ల ద్వారానే కరెంటు వైరింగ్ చేయించుకోవాలన్నారు. జన సంచారానికి, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగని విధంగా రద్దీ లేని ప్రాంతాలలో మండపాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యం జరగకుండా డీజేలు, లౌడ్ స్పీకర్ల వాల్యూమ్ పరిమితిలో ఉంచాలని సూచించారు. అర్ధరాత్రి వరకు శబ్దాలు చేయడానికి అనుమతి లేదన్నారు. మండపాల వద్ద టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధించబడిందన్నారు. అలాగే పూజా సామాగ్రి, అగరవత్తులు పెట్టేటప్పుడు నిప్పు రవ్వలు మండపానికి తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వినాయక మండపాల వద్ద మరియు నిమజ్జన ఊరేగింపులలో మద్యం సేవించి గొడవలు సృష్టించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. విగ్రహాల నిమజ్జనాన్ని పోలీసు శాఖ సూచించిన మార్గదర్శకాల ప్రకారం, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారి పై నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏ చిన్న సమస్య తలెత్తినా, అత్యవసర పరిస్థితి ఏర్పడినా వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని ఆయన ఆదేశించారు.

# వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు

## ఎస్ఐ సూరెడ్డి రాజేష్




(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టంబర్ 8)

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని ఎస్ఐ సూరెడ్డి రాజేష్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 14 నుండి జరిగే వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని డీజే సరఫరాదారులతో ఎస్ఐ మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సూచనలను వారికి తెలియజేశారు. నిమజ్జన సమయంలో డీజేలు, అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించి గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకునే విధంగా సహకరించాలన్నారు. నిబంధనలను పాటించని వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల


షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

09.09.26 బుధవారం




## భూముల రీసర్వే ప్రక్రియను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 8)

భూముల రీసర్వే ప్రక్రియను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి స్పష్టం చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ఒంగోలు డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సదస్సులో ఆమె పాల్గొని పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని వీఆర్వో, ఆర్ఐ, మండల సర్వేయర్, తహసిల్దార్ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రస్తుతం ఆరో విడత రీసర్వే సాగుతున్నందున మండలాలవారీగా పురోగతిని ఆమె సమీక్షించారు. నిర్దిష్ట గడువులోపు రీసర్వే పూర్తి చేయటంపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ దిశగా పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు చెప్పారు. పొరపాటున తమ భూములు 22(ఏ) జాబితాలో నమోదయ్యాయని ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, వాస్తవాలను పరిగణలోకి తీసుకొని, వారి భూములకు మిగతా 4లో

## దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న 13 మంది ముఠా అరెస్ట్

### రూ. 22.70 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం

### మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 8)

మార్కాపురం జిల్లా సియస్ పురం, పామూరు, కనిగిరి, కొనకరమెట్ల మండలాల్లో గల దేవాలయాలలో ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడిన 13 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. మంగళవారం ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. మంగళవారం ముద్దాయిలను పామూరు మండలం రావిగుంటపల్లి గ్రామ శివారులో ముద్దాయిలు ఇండ్ల విష్ణువర్ధన్, తమ్మిశెట్టి రమణయ్య, మల్లాల చెంచు సుబ్బారావు, సోమరాజుపల్లి ఉమా మహేశ్వరరావు, కొమ్మి కాటం రాజు, బత్తుల శ్రీను, పిన్నీ రాజీవ్, కమ్మ సూర్యతేజ, మోకా ఆంజనేయులు, దేరంగుల వెంకట రమణ, బండారు తిరుపతయ్య, దూదేకుల నాగూర్ షరీఫ్, చందాలూరి బాల గురవయ్యలను అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు వివరాల్లోకి వెళితే ఈ ముద్దాయిలలో బేల్దారు పనులు, మరికొందరు స్లాబ్ మిల్లర్ పనులు చేస్తూ ఉంటారు. ఆయా పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో ఒకరికొకరు పరిచయం ఏర్పడింది. వీరిలో విష్ణువర్ధన్ ఒక ప్రైవేట్ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, అతనికి సుబ్బారావు తోడుగా ఉండేవాడు. వీరిలో పాత నేరస్తుడైన సోమేపల్లి ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి ఒక దేవాలయంలో పూజారిగా పనిచేస్తూ, దేవాలయాల్లో చోరీలకు పాల్పడి సులభంగా డబ్బు సంపాదించవచ్చనే సలహాలు ఇచ్చేవాడు. కొమరోలు మండలానికి చెందిన బాల గురవయ్య చోరీ చేసిన సొత్తును స్వీకరించే రిసీవర్‌గా ఉండేవాడు. ఈ విధంగా దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడటం మొదలుపెట్టారు. ఈ క్రమంలో పలు దేవాలయాలను ముందుగా గుర్తించి, అక్కడి పరిస్థితులను పరిశీలిస్తూ, దొంగతనాలకు పాల్పడ్డారు. ఇటీవల కాలంలో మార్కాపురం జిల్లా పరిధిలోని సిఎస్‌పురం, పామూరు, కనిగిరి, కొనకనమిట్ల మండలాల్లోని పలు దేవాలయాలలో వరుసగా జరిగిన దొంగతనాలను దృష్టిలో ఉంచుకుని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఈ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జిల్లా ఎస్పీ నిరంతర పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కనిగిరి డీఎస్పీ పి శ్రీధర్ ఆధ్వర్యంలో పామూరు సీఐ డి వినోద్ కుమార్, కనిగిరి సీఐ యు శ్రీనివాసరావు, సిఎస్‌పురం, వెలిగండ్ల, పామూరు, కొనకనమిట్ల, పిసీపల్లి పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు వెంకటేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, అనూక్, శ్రీకాంత్, నరసింహారావు వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కేసులను వివిధ కోణాల్లో దర్యాప్తు చేయడంతో పాటు, సాంకేతిక ఆధారాలను సేకరించి, ఆయా గ్రామాల్లో ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వారి ద్వారా అందిన విశ్వసనీయ సమాచారాన్ని విశ్లేషిస్తూ ముందుకు సాగాయి. ఈ క్రమంలో మంగళవారంమిగతా 4లో








## పార్టీ రంగు పులుముకున్న ఫుడ్ కమిటీ చైర్మన్ పర్యటన

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టంబర్ 8)

అధికారిక కార్యక్రమంగా చెప్పుకుంటూ జిల్లాలో పర్యటించిన ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి పర్యటన కనిగిరిలో మాత్రం రాజకీయ రంగు పులుముకుంది. మంగళవారం ఉదయం కనిగిరి వచ్చిన చైర్మన్ 8వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చారు. ముందస్తుగా ఫిర్యాదులు పెట్టించి 8వ వార్డు తనిఖీకి వచ్చినట్లుగా ఉంది ఫుడ్ కమిషన్ చైర్మన్ వ్యవహార తీరు. సెంటర్‌కు వచ్చిన ఆయన లబ్ధిదారులను సంబంధిత అధికారుల సమక్షంలో విచారించాల్సి ఉంది. మిగతా 4లో

## మండపాల్లో విద్యుత్ భద్రతే ప్రధానం

### గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా

### 500 వాట్లకు రూ. 1,000, 1000 వాట్లకు రూ. 2,250

### ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి పుల్లారెడ్డి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 8)

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి పుల్లారెడ్డి సూచించారు. భక్తితో పూజిద్దాం.. భద్రతతో పండుగ జరుపు కుందాం అని ఆయ న పిలుపునిచ్చారు. మండపాల్లో విద్యుత్ అలంకరణలు, తాత్కాలిక విద్యుత్ వినియోగం విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. గణేష్ మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత మిగతా 4లో



## టీడీపీలో చేరిన విజయనగరం జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 08)

విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో మంగళవారం పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావును ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. మజ్జి శ్రీనివాసరావుతో పాటు ఆయన మిగతా 4లో

## పేద విద్యార్థులకు అందించే ఆహారంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

### ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 8)

ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల శ్రేయస్సు కోసం అందిస్తున్న పౌష్టికాహార పథకాల్లో ఎలాంటి అక్రమాలు, అలసత్వం జరగడానికి వీల్లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలలో నిర్ణయించిన ఆహార పట్టిక (మెనూ) ప్రకారం నాణ్యమైన భోజనం అందించకపోతే బాధ్యులైన అధికారులపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం మిగతా 4లో

## వెలిగొండ ప్రాజెక్టు "వెలుగుల జలధారా" పాట సీడి ఆవిష్కరణ

### సీడిని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 8)

వెలుగొండ ప్రాజెక్టు ప్రాధాన్యతను, మార్కాపురం ప్రాంత ప్రజల ఆశలను, రైతుల భవిష్యత్ ను, ఈ ప్రాంత అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మార్కాపురం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత మిగతా 4లో



# మండపాల్లో విద్యుత్ భద్రతే ప్రధానం

దూరంలో ఏర్పాటు చేయాలని సీఎండీ సూచించారు. మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అలంకరణలకు నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. మండపాలకు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని స్పష్టం చేశారు. విద్యుత్ వైరింగ్, ఇతర పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని సూచించారు. అధిక లోడ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పుల్లారెడ్డి సూచించారు. తడిసిన విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయాలని కోరారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేసే సమయంలో భక్తులు, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. అత్యవసర వాహనాలు, సేవలకు ఆటంకం కలగకుండా మండపాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సీఎండి తెలిపారు. 500 వాట్లకు రూ.1,000, 1000 వాట్లకు రూ.2,250 చొప్పున తాత్కాలిక విద్యుత్ సరఫరా రుసుము ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు తెలిపారు. గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ఏపిసిపిడిసిఎల్ వెబ్‌సైట్, మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సీఎండీ తెలిపారు. మండపాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టవిరుద్ధంగా విద్యుత్‌ను వినియోగించరాదని సీఎండీ హెచ్చరించారు. అనధికారిక కనెక్షన్లు తీసుకోవడం లేదా అక్రమంగా విద్యుత్ వినియోగించడం గుర్తిస్తే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పాటు విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## టీడీపీలో చేరిన విజయనగరం జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



కుమార్తె సిరి సహస్ర తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెకు కూడా సీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రులు కళావెంకట్రావు, కోండ్రు మురళీ, సుజయ్ కృష్ణ రంగారావు, ఎంపీ అప్పలనాయుడు, జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నేతలు ఉన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు "వెలుగుల జలధారా" పాట సీడి ఆవిష్కరణ

పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని డోలా శ్యామలాదేవి రచించిన "వెలుగొండ జలధారా – వెలుగుల జలధారా" పాటకు సంబంధించిన సీడీ ని మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆవిష్కరించారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే జలాలు ఈ ప్రాంతానికి కేవలం సాగునీటిని మాత్రమే కాకుండా రైతులకు భరోసా, ప్రజలకు ఆశ, మార్కాపురం ప్రాంతానికి అభివృద్ధి, భవిష్యత్ తరాలకు సుసంపన్నమైన జీవనాన్ని అందించే వెలుగుల జలధారగా మారాలని ఆకాంక్షిస్తూ ఈ పాటను రూపొందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామలాదేవి ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో చోరిలకు పాల్పడుతున్న 13 మంది ముఠా అరెస్ట్

పామూరు మండలం రావిగుంటపల్లి గ్రామ శివారులో పై దేవాలయ దొంగతనాలకు పాల్పడిన 13 మంది నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారి వద్ద నుండి సుమారు రూ.22.70 లక్షల విలువైన పంచలోహ విగ్రహాలు, ఇత్తడి విగ్రహాలు, ఇత్తడి తొడుగులు, వెండి దిమ్మలు, నగదు రూ.20వేలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా, నేరాలకు ఉపయోగించిన ఒక తుఫాను వాహనం, ఒక ఎర్టిగా కారు, రెండు మోటార్ సైకిళ్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవాలయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. కెమెరాలకు సంబంధించిన ఎత్తైన, భద్రమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అలాగే, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని తరచూ పరిశీలిస్తూ, వాటి రికార్డింగ్ డేటా కొన్ని రోజులపాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద ఘటనలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. దేవాలయాలలో జరుగుతున్న ఈ వరుస దొంగతనాలు దర్యాప్తును ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణలో కేసులు ఛేదించడంలో కృషి చేసిన కనిగిరి డిఎస్పి పి శ్రీధర్ బాబు, పామూరు సిఐ డి వినోద్ కుమార్, కనిగిరి సీఐ యు శ్రీనివాసరావు, ఎస్ఐలు, వారి సిబ్బంది, సిసిఎస్, ఐటీ కోర్ సిబ్బంది, మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

**దొంగలించిన వస్తువులు ఇవే.....**

సిఎస్‌పురం శివాలయంలో సుమారు 12 లక్షల విలువ గల రెండు పార్వతీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాలు మరియు ఒక ఇత్తడి అయ్యప్ప విగ్రహం, కనిగిరి మండలం చీరలదిన్నె గ్రామంలో గల కాశీ విశ్వేశ్వర స్వామి గుడిలో సుమారు రూ.10 లక్షల విలువ గల 4.5 కేజీల వెండి కవచం, వెండి నాగాభరణం, కొనకనమిట్ల మండలం గొట్లగట్టు రామాలయంలో రూ.25,000 విలువగల సుమారు 25 కేజీల ఇత్తడి హనుమంత వాహనం, పామూరు మండలం వగ్గం పల్లి గ్రామంలో పోలేరమ్మ తల్లి దేవాలయంలో సుమారు రూ.50 వేల విలువ గల ఇత్తడి కిరీటము, రెండు చేతుల కవచములు దొంగలించారు. వీటి విలువ సుమారు రూ.22,75,000 ఉంటుందన్నారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు....**

సిఎస్‌పురం శివాలయంలో సుమారు 12 లక్షల విలువ గల రెండు పార్వతీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాలు, ఒక ఇత్తడి అయ్యప్ప విగ్రహం, కనిగిరి మండలం చీరలదిన్నె గ్రామంలో గల కాశీ విశ్వేశ్వర స్వామి గుడిలో సుమారు రూ.10 లక్షల విలువ గల 4.5 కేజీల వెండి ఆభరణములు, కరిగించి పాత పోసిన నాలుగు వెండి గిన్నెలు, కొనకనమిట్ల మండలం గొట్లగట్టు రామాలయంలో దొంగలించిన 25 కేజీల ఇత్తడి హనుమంత వాహనం అమ్మగా వచ్చిన రూ.20 వేల నగదు, పామూరు మండలం వగ్గంపల్లి గ్రామంలో పోలేరమ్మతల్లి దేవాలయంలో సుమారు రూ.50 వేల విలువ గల ఇత్తడి కిరీటము, రెండు చేతుల కవచములు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

# పేద విద్యార్థులకు అందించే ఆహారంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



చౌక ధరల (రేషన్) దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్, సరుకుల నిల్వలు మరియు పంపిణీ తీరును పరిశీలించారు. అక్కడ విక్రయాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, రేషన్ డీలర్లకు పలు పటిష్టమైన సూచనలు చేశారు. ముఖ్యంగా రేషన్ పంపిణీ సమయంలో చిల్లర నాణేల కొరత వల్ల లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఉండటానికి డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని ఆదేశించారు. అందుకోసం ప్రతీ చౌక ధరల దుకాణం వద్ద ఫోన్ పే లేదా ఇతర క్యూఆర్ స్కానర్ ప్రింట్లను స్పష్టంగా కనిపించేలా అతికించాలని చెప్పారు. డిజిటల్ చెల్లింపుల వల్ల



ఆయన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి పాఠశాలలు, చౌక ధరల దుకాణాలు, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన చైర్మన్, తరగతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్‌లను స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా ముఖాముఖిగా మాట్లాడి, వారికి అందుతున్న వసతి సౌకర్యాలు, మెనూ ప్రకారం రోజూ అందిస్తున్న భోజన నాణ్యత, తాగునీటి సదుపాయాల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతులు, ఆహారం చాలా బాగున్నాయని విద్యార్థినులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సుమారు 700 మంది విద్యార్థినులు ఉన్న ఈ భారీ గురుకులంలో స్టాక్ రిజిస్టర్లు, సరుకుల నిర్వహణ అత్యంత పారదర్శకంగా ఉండడాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో పాఠశాల వంటశాలలో ఆహార పదార్థాలు వేగంగా, శుచిగా వండటానికి మరికొన్ని ఆధునిక పరికరాలు అవసరమని గుర్తించిన ఆయన, ఈ విషయాన్ని తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సింగరాయకొండ పట్టణంలోని రెండు



పారదర్శకత పెరుగుతుందన్నారు. రేషన్ పంపిణీలో లబ్ధిదారుల నుండి అదనంగా రూపాయి వసూలు చేసినా, లేదా బియ్యానికి బదులుగా నగదు ఇస్తూ అక్రమాలకు పాల్పడినా చట్టపరంగా కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సమీక్షిస్తూ, గతంతో పోలిస్తే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొంత మెరుగుపడిందని, అయితే ఇంకా మెరుగైన సేవలు అందించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కొందరు సిబ్బంది కేంద్రాలకు రాకుండా ఇష్టారాజ్యంగా హాజరు నమోదు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అత్యంత పరిశుభ్రమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని మాత్రమే అందించాలని చెప్పారు. అధికారులెవరూ మెనూ అమలులో ఎలాంటి పొరపాట్లు చేయకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. చివరగా, సింగరాయకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని (హాస్టల్) సందర్శించి, అక్కడ విద్యార్థుల వసతి, విద్యుత్, తాగునీరు మరియు భోజన నాణ్యతను తనిఖీ చేశారు. హాస్టల్ నిర్వహణ, ఆహార నాణ్యత బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ఆహార భద్రతా చట్టం ప్రకారం విద్యార్థులకు, లబ్ధిదారులకు దక్కాల్సిన హక్కులకు ఏమాత్రం భంగం వాటిల్లనివ్వకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంతకముందు కొండేపి గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ వో పద్మశ్రీ, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ రంగు పులుముకున్న ఫుడ్ కమిటీ చైర్మన్ పర్యటన



కానీ అందుకు విరుద్ధంగా కార్యకర్తను నీకు రాజకీయాలు ఎందుకంటూ మండిపడ్డారు. సిడిపిఓ, సూపర్‌వైజర్లను కూడా మహిళలు అని కూడా చూడకుండా ఇష్టానుసారంగా మాట్లాడారు. లబ్ధిదారులకు తెలియకుండా వచ్చాను, వెళ్ళాను అన్న విధంగా అక్కడ తనిఖీ జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ కేంద్రం రికార్డులన్నీ ఓ వ్యక్తి, కేంద్రం హెల్పర్ కొన్ని నెలలుగా వీడియోలు పెడుతున్నారని, విచారణ అవసరం లేదని వెళ్ళిపోవడం గమనార్హం. 9వ వార్డు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళి స్టాకుల్లో భారీ వ్యత్యాసం ఉన్నా ఆయన తనిఖీ వ్యవహారం కూడా అక్కడ మమ అన్నట్లుగా ఉందనే ఆరోపణలు వినిపించాయి. రేషన్ షాపుల తనిఖీ కూడా నిర్వహించారు. అయితే పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలను అందరిని పట్టణానికి 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏఎంసి కార్యాలయానికి పిలిపించి వారితో చిన్నపాటి సమావేశం ఏర్పాటు చేసి మీకు జీతాలు పెరగలేదు, గత వైసీపీ ప్రభుత్వంలో జీతాలు పెంచాలని ప్రయత్నించానని కానీ ప్రభుత్వం మారడంతో మీకు జీతాలు పెంచలేకపోయామన్నారు. కూటమి ప్రభుత్వాన్ని పరోక్షంగా విమర్శిస్తూ ఆయన పర్యటన సాగినట్లుగా అనిపిస్తుంది.

వీధి రౌడీల్లా ఆయన వ్యక్తిగత సిబ్బంది ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ వ్యక్తిగత సిబ్బంది వీధి రౌడీల్లా వ్యవహరించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్‌ను మీ పర్యటన రాజకీయ కార్యక్రమంగా ఉందన్న విమర్శల పై ప్రశ్నించగా ఆయన వ్యక్తిగత కార్యదర్శులు ఒక్క సారిగా వీధి రౌడీల్లా విలేకరుల పై చిందులేశారు. నీ పేరు చెప్పు నీ ఫోన్ నెంబర్ ఇవ్వు, నీ సంగతి తేలుస్తానంటూ బెదిరించారు. దాంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో చైర్మన్ కారు ఎక్కి వెళ్ళిపోయారు.

**ఫుడ్ కమిషన్ చైర్మన్ ఏమన్నారంటే....**

నా పర్యటన రాజకీయ పర్యటన కాదని, జిల్లా కలెక్టర్‌కు ముందస్తు సమాచారంతో ప్రోటోకాల్‌లో పర్యటిస్తానన్నారు. ఒక పార్టీకి సంబంధించిన సానుభూతిపరుల కేంద్రాలు, డీలర్ షాపుల్లోనే తనిఖీ చేశానని చెప్పడం వాస్తవం కాదన్నారు. తన నాలుగు సంవత్సరాల ఏడు నెలల కాలంలో రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు.

## భూముల రీసర్వే ప్రక్రియను నిర్థిష్ట గడువులోపు పూర్తి చేయాలి



క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. మ్యుటేషన్లు కూడా సకాలంలో అయ్యేలా చూడాలన్నారు. వివరాలన్నీ సక్రమంగా ఉన్న భూములకు సంబంధించిన పాస్ పుస్తకాల ప్రింటింగు, పంపిణీ పెంచాలన్నారు. ' సర్ కార్యక్రమంలో పెండింగ్ పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి వెంకటరమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, తహసీల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# చెన్నూరు స్మార్ట్ కిచెన్ నిర్వహణ అద్భుతం

## జైకా ప్రతినిధి యుమికో ఓనిషి ప్రశంసలు

**కొండపేట జెడ్పీ హైస్కూల్ స్మార్ట్ కిచెన్‌ను పరిశీలించిన జైకా, నీతి ఆయోగ్ బృందాలు**

**అధికారులు, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జైకా ప్రతినిధులు**








(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 8)
విద్యా రంగంలో పోషకాహార భద్రతకు అత్యంత స్ఫూర్తిని నింపుతున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ నిర్వహణపై జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ టీమ్ లీడర్ యుమికో ఓనిషి, నీతి ఆయోగ్ ఆరోగ్యం–పోషణ ప్రత్యేక నిపుణులు మోహిత్ సూద్ ప్రశంసల వర్షం కురిపించారు. మంగళవారం వైఎస్ఆర్ కడప జిల్లా చెన్నూరు మండలం కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్మార్ట్ కిచెన్ నిర్వహణ తీరును జైకా, నీతి ఆయోగ్ ప్రతినిధుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్‌లోని ప్రతీ విభాగం పనితీరును, ఆహార తయారీ విధానాన్ని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రతినిధులకు వివరించారు. అనంతరం చెన్నూరు మండల కేంద్రంలోని పీఎం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలవుతున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' అమలు తీరును యుమికో ఓనిషి పరిశీలించారు. స్మార్ట్ కిచెన్ ద్వారా పాఠశాలకు సరఫరా చేసిన భోజనాన్ని రుచి చూసి, దాని నాణ్యత పట్ల తీవ్ర సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి జైకా ప్రతినిధి యుమికో ఓనిషి, నీతి ఆయోగ్ ప్రతినిధి మోహిత్ సూద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, ఇతర అధికారులు సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల విద్యార్థులు స్మార్ట్ కిచెన్, మధ్యాహ్న భోజనంపై తయారు చేసిన పోస్టర్లను కలెక్టర్ చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రతినిధులు ఫోటో షూట్‌లో పాల్గొన్నారు. మీడియా ప్రతినిధులతో యుమికో ఓనిషి మాట్లాడుతూ... విద్యార్థులకు స్వచ్ఛమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడంలో చెన్నూరు స్మార్ట్ కిచెన్ మోడల్ ఎంతో ఆదర్శవంతంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సజావుగా సర్వసభ్య సమావేశం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టెంబర్ 8)
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కోమట్ల అంకమ్మ రెడ్డి అధ్యక్షతన మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సమావేశంలో గ్రామాలలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై ఎంపిటిసిలు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎపిడిఓ కె ధనలక్ష్మి, తహశీల్దార్ జె ప్రభకరరావు, వైస్ ఎంపిపిలు తుమ్మలపెంట ప్రసన్న లక్ష్మీ, కె బాబురావు, ఎంపిటిసిలు మున్నం భూలక్ష్మి, నల్లమోపు పద్మప్రియ, ఎం రాంబాబురెడ్డి, ఎ తిరుపతిరావు, కె గోవిందు, తులసమ్మ, అధికారులు పాల్గొన్నారు.

**ఎంపిటిసిలకు ఘన సన్మానం..**

చిన్నగంజాం మండల పరిషత్ పాలకవర్గానికి సర్వసభ్య సమావేశం అనంతరం సన్మాన, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పదవీకాలం సెప్టెంబర్ 23తో ముగియనున్న నేపథ్యంలో ఎంపిడిఓ కె.ధనలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి అంకమ్మరెడ్డి, 12 మంది ఎంపిటిసిలు, కో–ఆప్షన్ సభ్యుడను శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



## ప్రమాదకర మలుపు వద్ద వాహనదారులకు హెచ్చరిక

### అతివేగం ప్రమాదకరం

**సీఐ మల్లికార్జున**




(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 8)
జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా మండలంలోని హజరత్‌గూడెం రోడ్డు సమీపంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదకరమైన మలుపు ఉన్న ప్రాంతాల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండేలా రహదారి పై "ముందు ప్రమాదకర మలుపు ఉంది – నెమ్మదిగా వెళ్లండి" అనే హెచ్చరికను తెలుగులో రోడ్డు పైన పెయింటింగ్ చేయించారు. మలుపు వద్ద వాహనాల వేగాన్ని తగ్గించి, జాగ్రత్తగా ప్రయాణించేలా వాహనదారులకు అవగాహన కల్పించడమే ఈ చర్య ఉద్దేశమని సిఐ మల్లిఖార్జున తెలిపారు. ప్రమాదకర మలుపుల వద్ద వేగంగా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు తప్పనిసరిగా వేగాన్ని నియంత్రించుకుని ప్రయాణించాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని కంభం సీఐ మల్లికార్జున, ఎస్ఐ శివకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

## మధ్యాహ్న భోజనం రాజకీయ పార్టీల కార్యకర్తలకు ఇస్తే నాణ్యత ఎలా వస్తుంది

**డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్**




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 8)
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వం పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల నాణ్యత లోపిస్తుందని దళిత హక్కుల పోరాట సమితి మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. మంగళవారం కనిగిరికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి అంగన్వాడి పాఠశాలలను, కేజీబీవీ మోడల్ స్కూల్ సందర్శించిన క్రమంలో ఆయనకు మధ్యాహ్న భోజనం పైన నాణ్యత లోపించడానికి కారణాలతో అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు, వారి కార్యకర్తలకు ఏజెన్సీని ఇవ్వడం వల్ల మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తుందని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారికి చెప్పినప్పటికీ వారు సరైన రీతిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వారికి లబ్ధి చేకూరే విధంగా పనిచేస్తున్నారన్నారు. తద్వారా విద్యార్థులకు తగిన పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందటం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, అధికారులు పాల్గొన్నారు.

## అధునాతన సౌకర్యాలతో డైనింగ్ హాల్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 8)
జిజిహెచ్‌లో పని చేస్తున్న వైద్యుల డైనింగ్ హాల్ అధునాత సౌకర్యాలతో ఏర్పాటు చేసినట్టు జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు తెలిపారు. జిజిహెచ్ ప్రాంగణంలో ఏసీ సౌకర్యాలతో ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌ను అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణితో కలిసి మంగళవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వైద్యులు భోజన విరామ సమయంలో సౌకర్యవంతంగా భోజనం చేసేందుకు ఏసీ, డైనింగ్ టేబుల్‌తో కూడిన హాల్‌ను సిద్ధం చేశామన్నారు. వర్క్ ప్లేస్ లో సౌకర్యాలు ఏర్పాటు చెయ్యడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరెంటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ప్రభాకరరావు, నర్సింగ్ సూపరెంటెండెట్ ధనలక్ష్మి, ఏఆర్ఎంలు సునీల్ గవాస్కర్, లక్ష్మ నాయక్, తేజ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోండి

**అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎం బాలాజీ**



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 8)
మార్కాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి శాంతా కుమారి తరఫున మార్కాపురం కోర్టుల పరిధిలోని ఆరు మండలాల కోర్టు కానిస్టేబుల్స్‌తో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి యం బాలాజీ మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలు కక్షలు వీడి సామరస్య పూర్వకముగా తమ కేసులను రాజీ చేసుకుని, పల్లెలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పవలసిన ఆవశ్యకతను తెలియజేశారు. హెల్మెట్లు తప్పనిసరిగా వాడవలసినదిగా ద్విచక్ర వాహన దారులకు అవగాహన కల్పించవలసినదిగా తెలియజేశారు. ఇరు పార్టీలు పరస్పరం ఒకరి మీద మరొకరు ఆవేశంలో పెట్టుకున్న కేసులను రాజీ చేయడానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు .ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేయడం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని కావున, కక్షిదారులు ఈ అవకాశమును వినియోగించుకుని తమ కేసులను రాజీ చేసుకోవాలని తెలియజేశారు.

## ఎల్‌నినో ప్రభావం పై రైతులకు అవగాహన



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టంబర్ 8)
పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం మండలంలోని కాటూరివారి పాలెం పొదిలి–6, పొదిలి–5 రైతు సేవ కేంద్రాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల సాగులో తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక, తక్కువ నీటితో పంటల సాగు, తేమ సంరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, పురుగులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని పంటల ప్రణాళిక చేసుకోవాలని, అధిక నీటి అవసరం ఉన్న పంటల కంటే తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు నేలలో తేమను సంరక్షించే పద్ధతులను పాటించాలని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆంజనేయ స్వామికి శ్రావణ మాస పూజలు

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 8)**
శ్రావణ మాసంలోని నాల్గవ మంగళవారం సందర్భంగా స్థానిక శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి వీరేశచార్యులు ఆధ్వర్యంలో అభయ ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, ఆకు పూజ, సింధూర అర్చనతో పాటు పలు రకాల ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేక దాతలుగా కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం సలహాదారులు తులసి వెంకట శివ నారాయణ సతీమణి ఇందుమతి, శ్రీనివాసులు సతీమణి విజయలక్ష్మి, ముచ్చెర్ల సుధాకరరావు సతీమణి సుజాతమ్మ, మల్లు బాలచంద్రుడు సతీమణి భారతి, కుటుంబ సభ్యులకు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అత్యంత ప్రసాదాలను అందజేయడం జరిగింది. అనంతరం శ్రావణమాసంలో ఆంజనేయ స్వామికి ఆకపూజ అభిషేకం సింధూర అర్చన నిర్వహించడం వలన కలిగే శుభ ఫలితాలు గురించి భక్తులకు ఆలయ పూజారి విరివిరిగా తెలియజేశారు. శ్రావణమాసం మంగళవారం సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయం నిర్వాహకులు అల్లంకొండ వెంకటరమణ, కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు.









# విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీ కే ఇవ్వాలని ఒంగోలు డిపోలో నిరాహార దీక్షలు ప్రారంభం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 8)**
ఎస్డబ్ల్యుఎఫ్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒంగోలు డిపోలో విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే ఇవ్వాలని కోరుతూ మంగళవారం నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ నిరాహార దీక్షలను ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు పెళ్లూరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ అవలంబిస్తున్న వైఖరిని ఖండించారు. విద్యుత్ బస్సుల నిర్వహణ పెనకల్ కంపెనీకి ఇవ్వడాన్ని నిరసిస్తూ నెల్లూరు డిపోను ప్రైవేటీకరణ విధానాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. ఈ నిరాహార దీక్షలు ఒంగోలులో కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఈ నిరాహార దీక్షలో ఎస్డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి దాసరి మల్లికార్జునరావు, ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరెడ్డి, అద్దంకి డిపో నాయకురాలు అంజలి, ఒంగోలు డిపో సెక్రటరీ యు హరిబాబు, ఒంగోలు డిపో అధ్యక్షులు యు వెంకటేశ్వర్లు, ఒంగోలు డిపో సాయి, బాపట్ల వెంకటరావు, ఒంగోలు డిపో పబ్లిసిటీ సెక్రటరీ ఆర్ జగన్‌రావు, ట్రెజరర్ కే సుబ్బారావు తో కలిపి తొమ్మిది మంది నిరాహార దీక్షలో కూర్చున్నారు. నిరాహార దీక్షలకు ముఖ్య అతిథులుగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం అయ్యప్పరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి గెంటనపల్లి శ్రీనివాసులు, ఏపీ ఆర్టీఏ జిల్లా కోశాధికారి బివి రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు ఎస్ రవి, పి బ్రహ్మయ్య, తదితరులు నాయకత్వం వహించారు.

# పొగాకు పంట ఉత్పత్తి నియంత్రణ చేయాలి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 8)**
మండలంలోని వేంపాడు గ్రామంలో మంగళవారం 26వ వేలంకేంద్రం వేలం నిర్వహణ అధికారి బ్రిడ్జిభూషణ్ ఆధ్వర్యంలో పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రిడ్జిభూషణ్ మాట్లాడుతూ వాణిజ్య నారుమడి కింద రైతు రెండు హెక్టాల మించి పెట్టకూడదని ఒక్కొక్క హెక్టారుకు 500 చొప్పున టబాకోబార్డులో నారుమడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. తేలికపాటి నేల గల రైతులు 3.5 ఎకరాలలో 21 క్వింటాలు, 2.5 ఎకరాలలో 20 క్వింటాలు మాత్రమే పొగాకు పండించాలని రైతులకు సూచించారు. ఎల్ నీనో ప్రభావం వలన వర్షం తక్కువ నమోదు అవుతుందని దీని దృష్టిలో ఉంచుకొని పంట సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.ప్రత్యామ్నయ పంటల వైపు మొగ్గ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు దాసరి వెంకయ్య, దాసర రవి, క్షేత్ర సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గార్లపేట, వేమవరం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులు పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ ప్రతాపరెడ్డి







**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, సెప్టంబర్ 8)**
మండలంలోని గార్లపేట, వేమవరం, కూచిపూడి గ్రామాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ చింత ప్రతాపరెడ్డి పర్యటించారు. గార్లపేటలోని అంగన్వాడి కేంద్రాలను స్వయంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. వేమవరం అంగన్వాడి కేంద్రంలో 24 మంది పిల్లలు ఉండడంతో సంతోషం వ్యక్తపరిచి గ్యాస్ స్టాండ్ లేని కారణంగా అంగన్వాడీ కార్యకర్తకి రూ.2,000 నగదు బహుమతిగా అందజేసి స్టాండ్ ఏర్పాటు చేసుకోమని చెప్పడమే కాకుండా ఇంకా పిల్లలను ఎక్కువ మందిని చేర్చుకొని సెంటర్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కూచిపూడిలో రేషన్ షాప్‌ని సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. కమిషనర్ ప్రతాపరెడ్డి వెంట డిసిడిఓ హేమలత, డిప్యూటీ డిఇఓ రంగయ్య. ఐసిడిఎస్ పి డి ఏ పద్మ సునంద, ఐసిడిఎస్ సిడిపిఓ సుశీల దేవి, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు ఉన్నారు.

# మార్కాపురంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు బ్రోచర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 8)**
పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత, సమష్టి భావనను పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలను మార్కాపురంలో నిర్వహించడం స్థానికంగా క్రీడా వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ముఖ్యంగా పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.క్రీడాకారులకు వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధితులకు సూచించారు. పోటీలు ప్రశాంత వాతావరణంలో, క్రీడా నియమ నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీలు, తదితరులు పాల్గొన్నారు.



# గిద్దలూరు డివిజన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టంబర్ 8)**

సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలకు అరుదైన గౌరవం లభించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 5న మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత మరియు జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న గిద్దలూరు డివిజన్ ఉపాధ్యాయులను యూటీఎఫ్ గిద్దలూరు డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షతన ఈ అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు, నియోజకవర్గ టీడీపీ నాయకులు క్రిష్ణ కిషోర్‌రెడ్డి హాజరై గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాల నుంచి పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రిష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం చదువు చెప్పడమే కాకుండా భావి పౌరులను తీర్చిదిద్దడంలో అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందడం వారి కష్టానికి, నిస్వార్థ సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ అభినందన సభలో గిద్దలూరు డివిజన్ పరిధిలోని మూడు మండలాల నుంచి సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని పురస్కార గ్రహీతలను అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి మాధవీదేవి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు సంచుల శ్రీనివాసులు, సీపీఎస్ జిల్లా కన్వీనర్ ఆవుల రాజు, యూటీఎఫ్ సలహాదారులు జయచంద్రారెడ్డి, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల అధ్యక్షులు రామచంద్రారెడ్డి, రఘురామ్, వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు బాల వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, కృష్ణారెడ్డి, మూడు మండలాల కమిటీ సభ్యులు, సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామాల్లో పొలం పిలుస్తుంది





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టంబర్ 8)**

మండలంలోని రాజుపాలెం, కొల్లూరుపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి డి విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఏపిఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, ప్రభుత్వం వారు వ్యవసాయ శాఖ ద్వారా అందించు పిఎం కిసాన్ పథకం పొందాలన్నా, పంట ఇన్సూరెన్స్, నష్ట పరిహారం, ధాన్యం అమ్మకాలు ప్రతి పథకం అర్హతకు 11 అంకెల రైతు గుర్తింపు నెంబర్ కలిగి ఉండాలి కాబట్టి సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి పొందాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాజిద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ అభ్యర్థులపై 'గొడ్డలి' పర్వం ఎమ్మెల్యే జూలకంటి

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 8)**

మెగా డీఎస్సీ అభ్యర్థులపై వైసీపీ 'గొడ్డలి' పర్వం ఇంకా ఆగడం లేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అనేది శవ రాజకీయాల పునాదులపై పుట్టిన నీచ సంస్కృతి గల పార్టీ అని విమర్శించారు. కన్న తండ్రి మరణిస్తే ఏ కొడుకైనా శోకసంద్రంలో మునిగిపోతాడని, జగన్ మాత్రం తాను సీఎం కావాలనే యావతో సంతకాల సేకరణలో బిజీగా గడిపిన స్వార్థపరుడని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు కోడికత్తి డ్రామాలు ఆడి, సొంత బాబాయ్‌ని గొడ్డలితో చంపించి నారాసుర రక్తచరిత్ర అంటూ సానుభూతి పొంది గద్దెనెక్కిన చరిత్ర జగన్‌ది కాదా అని నిలదీశారు. బాబాయ్‌కి గొడ్డలిపోటు, కన్న తల్లికి, తోడబుట్టిన చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తికి రాష్ట్రాన్ని పాలించే నైతిక అర్హత లేదన్నారు.'ఒక్క అవకాశం' అంటూ అధికారంలోకి వచ్చి 150కి పైగా ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయకుండా ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను నట్టేట ముంచారని మండిపడ్డారు. యువతను గంజాయి, డ్రగ్స్ మత్తులోకి నెట్టి అన్నపూర్ణ లాంటి రాష్ట్రాన్ని




నాశనం చేశారని, నాసిరకం కల్తీ మద్యంతో ఏకంగా 30 వేల మందికి పైగా ప్రాణాలు బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గురువులను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టి అవమానించిన వైసీపీ నేతలు, నేడు కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీపై నిస్సిగ్గుగా తప్పుడు ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని జగన్, నియామకాలను అడ్డుకోవడానికి ఏకంగా 300 పిటిషన్లు వేయిస్తే దేశ సర్వోన్నత న్యాయస్థానాలు వాటన్నింటినీ కొట్టివేశాయని గుర్తుచేశారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ,వైసీపీ కుట్రలన్నింటినీ ఛేదించారని కొనియాడారు. కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత లోకేష్‌కే దక్కుతుందన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువత ఎంతో శ్రమించి సాధించిన కొలువులను చూసి ఓర్వలేక వైసీపీ రాక్షసానందం పొందుతోందని విమర్శించారు. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తుంటే చూడలేని జగన్, కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి శవాల గుట్టలపై రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ, ఉత్తరాంధ్ర కాలువ, పోలవరం సహా 36 కీలక ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి, మంత్రులకు నిర్దిష్ట లక్ష్యాలు నిర్దేశిస్తూ 'సూపర్ సిక్స్' పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# మాలల పై హత్యాయత్నం చేసిన ఆర్టీసీ డ్రైవర్ "రెడ్డి" పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

## అంటరానితనం పాటిస్తున్న డ్రైవర్ రెడ్డిని ఆర్టీసీ నుండి తొలగించాలి
## దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 8)**

గురువారెడ్డిపాలెం మాలలను ఆర్టీసీ బస్సుతో గుద్ధి హత్యాయత్నం చేసిన ఆర్టీసీ డ్రైవర్ పూసపాటి వెంకటరామిరెడ్డిని హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్రావ్ డిమాండ్ చేశారు. మంగళవారం సమితి కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో నీలం నాగేంద్రావు మాట్లాడారు. మద్దిపాడు మండలం గురువారెడ్డి పాలెం మాలల పట్ల అదే గ్రామానికి చెందిన పూసపాటి వెంకటరామిరెడ్డి ఆర్టీసీ డ్రైవర్ అగ్రకుల అహంకారంతో చాలా కాలంగా వ్యవహరిస్తున్నాడు అన్నారు. అదే రూట్ లో బస్సు డ్రైవర్ గా పనిచేస్తూ ఆ గ్రామ మాలలపట్ల అగ్రకుల కండ కావరం తో చెలరేగిపోతున్నాడు అన్నారు. మాలలు ముందుగా వచ్చి బస్సు సీట్లో కూర్చున్న ఇతర కులాలు వస్తే మాలలను వీటిల్లో నుండి లేమ్మని అవమానిస్తూ బెదిరించేవాడు అన్నారు. వచ్చేటప్పుడు పోయేటప్పుడు మాలపల్లి దగ్గర కాలేజీకి పోయే స్టూడెంట్స్ బస్సు కోసం ఎదురు చూస్తుంటే ఆపకుండా వెళ్లేవాడన్నారు. ఈ విధంగా చాలా కాలం నుండి జరుగుతుంటే బస్సు ఎందుకు అపవని మాల కులస్తుల అడిగితే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి మీకు చేతనైంది చేచుకోండి,ఏ గవర్నమెంట్ అయినా మాదే మమ్మల్ని మీరేమీ చేయలేరంటూ అగ్రకుల అహంకారంతో రెచ్చిపోయేవాడు అన్నారు. ఈ క్రమంలో ఒంగోలు ఆర్టీసీ మేనేజర్ కు ఫిర్యాదు చేసిన వెంకట్రామిరెడ్డి తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఇంకా రెచ్చిపోయేవాడు అన్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మిట్నసుల అక్షయ అను ఒంగోలులో డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థిని కాలేజీ నుండి వస్తూ మాలపల్లి దగ్గర బస్సును ఆపమని కోరింది. ఈ మాలపల్లి దగ్గర బస్సు ఆపను,,మీకు చేతనైయింది చేసుకోండి, మీకు దిక్కున్న చోట చెప్పుకోండని తిడుతూ దౌర్జన్యం చేసాడన్నారు. అంతలో అక్షయ




బంధువులు కొంతమంది బస్సు వద్దకు రాగా వాళ్లందర్నీ కలిపి మాల ముండల్లారా అని వారిపై బస్సు పోనిచ్చాడు. ఆడవాళ్ళ మీదకి బస్సు ఏంది తెస్తావు ఎందుకని అడిగిన రాపూరి వెంకట్రావుమరి కొంతమంది మాలలను కూడా కులం పేరుతో తిడుతూ అవమానించి ఆర్టీసీ డ్రైవర్ పూసపాటి వెంకట్రామిరెడ్డి బెదిరించాడన్నారు. గురువారెడ్డి పాలెం మాలలందరూ వెంకట్రామిరెడ్డి అగ్రకుల అహంకారానికి నిరసనగా ఆర్టీసీ బస్సు నిలిపివేసి ఆందోళన చేశారన్నారు. పోలీస్ ఎఫ్ ఐ ఆర్ తమకు తెచ్చిస్తేనే ఆర్టీసీ బస్సును కదిలిస్తామని బయటాయించారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు మద్దిపాడు ఎస్ఐ సూర్యవంశం సంఘటనా స్థలానికి వచ్చి ఎఫ్ఐఆర్ ఇచ్చారన్నారు. ఈ ఘటన మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యిందన్నారు. ఆర్టీసీ అంటే రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కాదని, రెడ్డి ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ అని ఆర్టీసీ డ్రైవర్ పూసపాటి వెంకట్రామిరెడ్డి చాలా కాలంగా రెడ్డి కుల అహంకారంతో ఫ్యాక్షనిస్టుగా మాలల పై అస్పృశ్యత పాటిస్తూ, అహంకారంతో చిట్టచివరికి మాలల చేతికి చిక్కాడన్నారు. మాలలను ఆర్టీసీ బస్సుతో గుద్ది చంపటానికి ప్రయత్నించిన ఆర్టీసీ డ్రైవర్ పూసపాటి వెంకట్రామిరెడ్డి పై హత్యాయత్నం కేసుగా నమోదు చేయాలన్నారు. కులహంకారంతో ఫ్యాక్షనిస్టుగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్ పూసపాటి వెంకట్రామిరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం, యానాది పరిరక్షణ సమితి కన్వీనర్ కోలా జీవరత్నం, తదితరులు ఉన్నారు.

# వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు ఎస్ఐ సిహెచ్ శివ బసవరాజు



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టంబర్ 8)**

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ శివబసవరాజు స్పష్టం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 14 నుండి జరగబోవు వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని డీజే సరఫరాదారులతో ఎస్ఐ మంగళవారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సూచనలను వారికి వివరించారు. నిమజ్జన సమయంలో డీజేలు, అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించి గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలను పాటించని వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# కొత్త పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, సెప్టంబర్ 8)**



మండలంలోని అర్హులైన వారు కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎండీఓ హనుమంతరావు మంగళవారం సూచించారు. సంబంధిత పత్రాలతో గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు దరఖాస్తు ఫారాలను అందజేయాలని తెలిపారు. ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన, వెరిఫికేషన్ అనంతరం అర్హులకు పెన్షన్లు మంజూరు చేస్తామని ఎండీఓ తెలిపారు.అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని హనుమంతరావు కోరారు.ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# కలెక్టర్ విజయ సునీతకు అభినందనలు





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 8)**

బిజెపి మహిళా మోర్చా సెక్రటరీ, మార్కాపురం నియోజకవర్గ బిజెపి ఇంచార్జి (బిఎల్ఏ1) బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా బిజెపి నాయకులు మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతను మంగళవారం ఆమె ఛాంబర్‌లో ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు తొలి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విజయ సునీత ఒక మహిళా కలెక్టర్‌గా ఆగస్టు 31వ తేదిన చారిత్రాత్మకమైన శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేసిన భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారంలోను, ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం, గ్రీవెన్స్ డే లో ప్రజల నుండి వచ్చే సమస్యల పరిష్కారంలో అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎన్నో భావోద్వేగ, సున్నితమైన సమస్యలను, మెలుకువలు, సమయస్ఫూర్తితో జిల్లా కలెక్టర్‌గా విజయ సునీత వ్యవహరించిన తీరుపట్ల ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు "అభినందన పత్రాన్ని" సమర్పించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ కలెక్టర్ విజయ సునీత ఇదే రెట్టింపు ఉత్సాహంతో మన నూతన మార్కాపురం జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకుని వెళుతుందన్న విశ్వాసం జిల్లా ప్రజలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షుడు పివి కృష్ణారావు, స్టేట్ బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ జి నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల శివప్రసాద్, కనిగిరి నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి (బిఎల్ఏ-1) నరాల శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల లక్ష్మి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజా శ్రీకాంత్, జిల్లా బిజెపి మహిళా నాయకురాళ్లు కోణా లక్ష్మీ, అరుణ భాయి, పట్టణ ప్రధాన కార్యదర్శి గొల్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఫిజియోథెరపీ పై అవగాహన కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టంబర్ 8)**

మంగళవారం ఉదయం ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో శారీరక కదలికలు తగ్గిపోవడం వల్ల వచ్చే దీర్ఘకాలిక నొప్పులు, గుండె, ఊపిరితిత్తుల జబ్బులు మరియు పక్షవాతం వంటి వ్యాధులను నివారించడంలో ఫిజియోథెరపీ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, కీళ్ల నొప్పులు రాగానే పెయిన్ కిల్లర్స్ వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం లభించినా, కాలక్రమేణా ఇతర దుష్ప్రభావాలు వచ్చే ప్రమాదం ఉందని, కావున దీర్ఘకాలిక కీళ్ల సమస్యల్లో కొద్ది పాటి మందులతో పాటు ఫిజియోథెరపీలోని వ్యాయామాలు, సరైన భంగిమలు, మసాజులు, కరెంటు ద్వారా చచ్చుబడిన నరాలను ఉత్తేజ పరచడం చాలా వరకు మంచి ఫలితం ఉంటుందని, పక్షవాతం బారిన పడినవారు మరియు ఆటిజం వంటి సమస్యతో బాధపడే చిన్నారులకు తగిన ఫిజియోథెరపీ వ్యాయామాల ద్వారా త్వరగా కోలుకుని, స్వతంత్రంగా తమ పనులు తాము చేసుకునే స్థాయికి చేరుకోగలరని, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు ఎక్కువగా వాడే ఉద్యోగులు, విద్యార్థులు పని మధ్యలో చిన్నపాటి విరామం తీసుకుంటూ తేలికపాటి వ్యాయామాలు చేయాలని, రోజూ కనీసం 30 నిమిషాల నడకను ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని, ఉప్పుటూరులో ప్రభుత్వ హోమియో వైద్యశాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఒక ఫిజియోథెరపీ విభాగాన్ని కూడా మొదలుపెట్టే దిశగా అందరు ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు కే.నాగరాజా, వీఆర్వో నాగలక్ష్మి, ఆషా రత్నకుమారి, హాస్పటల్కి వచ్చిన రోగులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు హెచ్చరిక పెయింటింగ్







**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, సెప్టంబర్ 8)**

మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా మంగళవారం మండలంలోని ప్రధానమైన చిన్నారికట్ల జంక్షన్, దొనకొండ రోడ్డు, కనిగిరి రోడ్ల వద్ద ముందు జంక్షన్ ఉన్నది నిదానంగా వెళ్ళండి అనే హెచ్చరికను ఎస్ఐ బి శ్రీకాంత్ రోడ్డు పై రేడియం పెయింటింగ్ వేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ వేగంగా వచ్చే వాహనదారులు కనీసం రోడ్డు పైన రాయించిన పెయింటింగ్ చూసైనా కొంత మేర వాహనాల వేగాన్ని తగ్గించుకుని ప్రమాదాల బారిన పడకుండా చూడాలనే ఉద్ధేశ్యంతో ఈ చర్యలు చేపట్టామన్నారు. ఈ పెయింటింగ్ లు రాత్రి వేళల్లో వాహనాల లైటింగ్‌లో మరింత కాంతివంతంగా కనపడడంతో ప్రమాదాలను నివారించవచ్చునని భావించిన జిల్లా ఎస్పీ సూచనల మేరకు పెయింటింగ్‌లు వేయించడం జరిగిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం రాజేష్‌కుమార్ పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. ఆయన సూచనలు కూడా పాటించి ప్రజల ప్రాణాలను రక్షించడమే బాధ్యతగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి పై అవగాహన ర్యాలీ, సదస్సు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 8)**

మార్కాపురం జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో మంగళవారం కనిగిరి ఎన్జీవో హోమ్ నుండి పామూరు రోడ్‌లో కుష్టు వ్యాధి పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ మార్కాపురం జిల్లాను కుష్టురహిత జిల్లాగా చేయుటకు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది అందరూ కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీ అనంతరం ఎన్జీవో హోమ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుండి 24వ తేదీ వరకు అనగా 14 రోజులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించబడుతుందని, ఈ సర్వేలో ఆరోగ్య సిబ్బంది టీముల్లాగా ఏర్పడి ప్రతి గృహమును సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలు పై అవగాహన కల్పించి స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ముఖ్యంగా కుష్టి వ్యాధి అనేది మైకో బ్యాక్టీరియా లేప్రే అనే బ్యాక్టీరియా వలన మీ వ్యాధి వ్యాపిస్తుంది. ఇది దీర్ఘ కాలిక వ్యాధి, ఈ వ్యాధి లక్షణములు చర్మం పై స్పర్శ లేని మచ్చలు, చెవులు, వీపు, ఎద పై నొప్పు లేని బుడిపలు, కనురెప్పలు మూతపడకపోవడం, కనురెప్పల పై వెంట్రుకల రాలిపోవటం, కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉంటా, చల్లని లేదా వేడి వస్తువులు గుర్తించలేకపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవుట, చేతి వేళ్ళు కాలు వేళ్ళు వంకరలు తిరుగుట అంగవైకల్యం రావటం ఇవన్నీ ప్రధాన లక్షణాలన్నారు. ఈ సర్వే ముఖ్య ఉద్దేశం దాగి ఉన్న కుష్టి వ్యాధి కేసులను ముందుగానే గుర్తించి వారికి ఉచితంగా ట్రీట్మెంట్ చేసి జాతీయ కుష్టి వ్యాధి లక్ష్యాలను సాధించడం ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా సమాజం నుండి పారద్రోలవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జివి ఫణి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎంవి విజయభాస్కర్, డిపిఎమ్ఓ ప్రసాద్‌రెడ్డి, ఎంపిహెచ్ఈఓ శ్రీకాంత్, హెల్త్ అసిస్టెంట్స్ నాగరాజు, రామకృష్ణ, తిరుపతయ్య, రెండు అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



# సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యం

**వయోజన విద్య డిడి జగన్మోహనరావు**



**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, సెప్టంబర్ 8)**

వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అక్షరాంధ్ర కార్యక్రమం అమలవుతుందని వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బి జగన్మోహనరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా మద్దిపాడులో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అక్షరాస్యత ర్యాలీ చేపట్టారు. అక్షరాస్యత ఆవశ్యకత ను తెలియజేస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ శ్రీనివాస వరప్రసాద్ అధ్యక్షతన సభ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనం చేసి సభను ఆరంభించారు. అక్షరాంధ్ర రెండో విడత కార్యక్రమంలో జిల్లా పరిధిలో 98,475 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారి వివరాలు అక్షరాంధ్ర యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామని వివరించారు. మంగళవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించాలని కోరారు. వంద గంటల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఎంఈవో ఆంజనేయులు, ఏపిఓ సురేఖ, పలువురు వయోజన విద్య పర్యవేక్షకులు, వెలుగు సిసి లు, వివిధ గ్రామాలకు చెందిన విఓఏలు, పలువురు విశ్రాంత ఉద్యోగుల సభలో పాల్గొని మాట్లాడారు.

# పాఠశాలలకు విలువల విద్య పుస్తకాల పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 8)**

విద్యార్థుల్లో నైతిక విలువలు, మానవతా దృక్పథం, మంచి ప్రవర్తనను పెంపొందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న 'విలువల విద్య' పుస్తకాలను మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే నిజాయితీ, క్రమశిక్షణ, దయ, సేవాభావం, బాధ్యత, సహనం, సత్ప్రవర్తనా విలువలను అలవర్చే విధంగా పుస్తకంలోని పాఠ్యాంశాలను రూపొందించారనీ,పాఠశాలలకు పుస్తకాలు చేరిన అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేసి, తరగతి బోధనలో భాగంగా వినియోగించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com